క్లుప్తంగా

ఉక్కు దీక్షలకు నిర్వాసితుల మద్దతు



దీక్షల్లో పాల్గొన్న అగనంపూడి నిర్వాసిత కాలనీ వాసులు

అగనంపూడి: ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల పిలుపు మేరకు విశాఖనగరంలో ఏర్పాటు చేసిన నిరసన దీక్షా శిబిరంలో అగనంపూడి నిర్వాసితకాలనీకి చెందిన దానబోయిపాలెం మహిళా సంఘం, కొండయ్యవలస మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మా యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్ (యూజ్) ఆధ్వర్యంలో వీరంతా తరలివెళ్లారు.

అమర్‌నాథ్ దృష్టికి సమస్యలు



అమర్‌నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న అండిబోయిన లక్ష్మి తదితరులు

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు, హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి కోరారు. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను శుక్రవారం ఆమె కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం పార్టీ కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై చర్చించారు. అమర్‌నాథ్‌ను కలిసిన వారిలో అండిబోయిన అప్పారావు, వెంపాడ అప్పారావు, ఒనుము నాగేశ్వరరావు, దల్లి పైడికొండ, తోకాడ అప్పారావు తదితరులు ఉన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవడం శుభపరిణామం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లో చేర్చుకోడానికి యాజమాన్యం ముందుకు రావడం శుభపరిణామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. కూర్మన్నపాలెం దీక్షా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉక్కు ప్రైవేటీకరణలో భాగంగానే 4200 మంది కాంట్రాక్ట్ కార్మికులను యాజమ్యాం తొలగించిందని, దీనిపై కార్మికులతో పాటు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అల్టిమేటం జారీ చేయడంతో యాజమాన్యం స్పందించి కార్మికులను విధుల్లోకి తీసుకుంటున్నట్టు ప్రకటించిందన్నారు. ఇదే స్ఫూర్తితో అంతా పోరాటం చేసి ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహరదీక్షకు సాంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా సెయిల్‌లో విలీనం చేయాని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఆశించకుండా దేశంలోనే అత్యుత్తమంగా నడుపుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తాం అని బాధ్యతా రహితంగా మాట్లాడితే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పడు, ప్రజాగాయకుడు దేవిశ్రీ, మత్స్యకార సంఘం నాయకులు ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వేడుక.. ఆనంద గీతిక..



ఓనం ముగ్గు

ఓనంతో సందడి చేస్తున్న మలయాళీలు

వేదికగా నిలుస్తున్న కైరళిక్లబ్



ఓనం వేడుకలో మహాబలి పాత్రధారణ



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న కైరళి ఆర్ట్స్ క్లబ్ ప్రతినిధులు

గాజువాక: సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేసే మలయాళీలు ఓనం పండగతో సందడి చేస్తున్నారు. పారిశ్రామిక రాజధానిగా వెలుగొందిన గాజువాక ప్రాంతంలో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి ఆనందంగా గడుపుతున్నారు. వీరిని కై రళి ఆర్ట్స్ క్లబ్ ఐక్యంగా ముందుకు నడుపుతోంది.

18 వేల కుటుంబాలు.. 70 వేల జనాభా

ప్రస్తుతం విశాఖ జిల్లాలో 18 వేల మలయాళీ కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 70 వేల నివసిస్తున్నట్టు అంచనా. కేరళలోని వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చి ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడిన కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. విశాఖలో కాల్‌ట్యాక్స్, షిప్‌యార్డు నిర్మాణ సమయంలో కేరళీయులు ఇక్కడికి రావడం మొదలుపెట్టారు. ఆ సంఖ్య విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ప్రారంభమైన తర్వాత మరింత పెరిగింది. దీంతో మలయాళీల సంస్కృతి, సాంప్రదాయాలు విశాఖ వాసులకు సైతం పరిచయమయ్యాయి.

ఒకే గొడుగు కింద మలయాళీలు

కేరళలోని వివిధ ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చిన మలయాళీలను కై రళి ఆర్ట్స్ క్లబ్ ఐక్యంగా ముందుకు నడుపుతోంది. వారిని ఐక్యం చేయడానికి, ఆచార సాంప్రదాయాలను కాపాడుకోవడానికి కై రళి ఆర్ట్స్ క్లబ్ పని చేస్తోంది. 1980లో ప్రారంభమైన ఈ సంస్థ మలయాళీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పేద మలయాళీ కుటుంబాలకు, ప్రతిభ ప్రదర్శించే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాలను నిత్యం ఏర్పాటు చేస్తోంది. మినీ ఇండియాగా పిలుచుకొనే గాజువాక ప్రాంతంలో కేరళ సాంప్రదాయం ప్రత్యేకమనే చెప్పవచ్చు.

అంతా సందడి

మలయాళీల సంస్కృతికి అద్దంపట్టే అనేక పండగలు ఇక్కడివారిని విశేషంగా ఆకట్టుకుంటాయి. వారి ఆచారాలు, అలవాట్లు చూస్తే ముచ్చటేస్తునడంలో అతిశయోక్తిలేదు. తెలుగు వారికి ప్రతిష్టాత్మకమైన పండగ సంక్రాంతి ఎలాగో, మలయాళీలకు ఓనం వేడుక అంత ప్రధానమైనది. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మధ్య ఈ వేడుకను మలయాళ కుటుంబాలు అత్యంత సందడిగా నిర్వహిస్తారు. అన్ని ప్రాంతాలకు చెందిన మలయాళీలు ఒకే వేదికపైకి వచ్చి వినూత్నమైన ముగ్గులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఓనం రోజు ఆనందంగా గడుపుతారు. జిల్లాలో పలువురు ప్రముఖులను ఆహ్వానించి తమ సంతోషాన్ని పంచుకుంటారు. పండగకు సుమారు 16 రకాల వంటకాలు తయారు చేసి మూడువేల మందికి తగ్గకుండా వడ్డిస్తారు. కేరళీయులు జరుపుకొనే ఉత్సవాల్లో విషు ఉత్సవం మరొక విశేషం. తెలుగువారికి ఉగాది ఎలాగో, వారికి విషు అలాంటిది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఈ ఉత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కథాకళి వంటి నృత్య రూపకాలను కనుల పండువగా నిర్వహిస్తారు. కూరగాయలతో ప్రసాదం తయారు చేసి అందరికీ రుచి చూపిస్తారు. ఇంకా క్రిస్మస్, న్యూ ఇయర్ వంటి పండగులు కూడా ఎంతో వేడుకగా నిర్వహిస్తారు.

నిలిచిపోయిన టెండర్లను పునఃపారంభించాలి



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నిలిచిపోయిన టెండర్ల ప్రకియను వెంటనే పునఃప్రారంభించాలని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు పరిపాలన భవనం వద్ద శుక్రవారం అఖిలపక్ష కాంట్రాక్ట్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ క్యూఏటీడీ, ఎస్‌టీఈడీ, సీఎంఎస్ విభాగాల్లో టెండర్లు సకాలంలో పూర్తి కాకపోవడంతో సుమారు 500 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఉక్కు యాజమాన్యం కావాలనే టెండర్ల ప్రక్రియను జాప్యం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం ఆ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, నమ్మి రమణ, వంశీ, బొడ్డు రాజేష్, వి.వి. రమణ, రామిరెడ్డి, అవతారం, తాతారావు, . దనలక్ష్మి, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

203 మందికి నేత్ర పరీక్షలు



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, గంగవరం పోర్టు ప్రతినిధులు

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ నిధులతో జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు,అదానీ గంగవరం పోర్టు హెచ్‌ఆర్ హెడ్ అనిల్, మేనేజర్ రమేష్‌బాబు ప్రారంభించారు. మొత్తం 203 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 98 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. విశాఖ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త కార్యవర్గం

పెదగంట్యాడ: ఏపీ గవర్నమెంట్ ఐటీఐ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యూవీ శివకుమార్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ నూ ఐటీఐలో కొత్త కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పి.శ్రీనివాసు, ఉపాధ్యక్షురాలిగా ఎం.లతా దేవి, కోశాధికారిగా ఎం.ఎస్.డి.డి.వర్మ, సహాయ కార్యదర్శిగా కిరణ్‌కుమార్, సభ్యులుగా తులసీరావు, పీవీడీ ప్రసాద్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.రాములప్పడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కొత్త కార్యవర్గాన్ని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామన్నారు.

కేజీహెచ్‌కు ఇద్దరు వైద్యులు

మహారాణిపేట: ఏఎంసీ,కేజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ గా డాక్టర్ ఎం.చంద్రోశఖరం నాయుడు, ఎండోక్రానాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఎం.కీర్తన నియమితులయ్యారు. చంద్రోశఖరం నాయుడు నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీనుంచి, డాక్టర్ కీర్తనను కర్నూల్ మెడికల్ కాలేజీ నుంచి బదిలీ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

మానవహారాన్ని జయప్రదం చేయాలి



మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న వైఎస్సార్ టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6న అగనంపూడి నుంచి పాత గాజువాక జంక్షన్ వరకూ నిర్వహించనున్న మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శుక్రవారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, అనపర్తి మసేనురావు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, పిట్టా రెడ్డి, నందికి తాతారావు, ఎం.మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో..

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థలోనే కొనసాగించాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు కోరారు. నెల్లిముక్కులో ఆహ్వాన పత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు మానవహారం కార్యక్రమంలో నిర్వాసితులు కుటుంబాలతో కలసి పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, మసేనురావు, ఎల్లేటి శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.

మానవహారంతో ఐక్యత చాటుదాం

6న అగనంపూడి నుంచి గాజువాక వరకు



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 6న నిర్వహించనున్న మానవహారాన్ని జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లతో అగనంపూడి నుంచి గాజువాక వరకు ఈ కార్యక్రమం జరగుతుందన్నారు. ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వై.టి. దాస్, కె. గంగాధర్, రాజు, నీలకంఠం, పుల్లారావు, వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రోస్క్రాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నూతన కార్యవర్గ జాబితాను యూనిట్ హెడ్‌కు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఫెర్రోస్క్రాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఫెర్రోస్క్రాప్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ కోరారు. యూనియన్ నాయకులు శుక్రవారం యూనిట్ హెడ్ సంజయ్ కుమార్‌ను కలిసి కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గ జాబితాను యూనిట్ హెడ్‌కు అందజేశారు. సలహాదారుగా ఎన్నికైన పి.వి.ఆర్.ఎ.ఎస్.ఎన్. రాజు, అధ్యక్షుడు పి. రాములు, ప్రధానకార్యదర్శి ఎం. అమ్మిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్కిందర్ సింగ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. అప్పారావు, సంయుక్త కార్యదర్శులు ఎస్.వి. రమణ, డి.సిహెచ్.వి.టి. రావు, ఉపాధ్యక్షులు ఎల్‌పీ శివశంకర్, టి. ధనరాజ్ జీవరామ్, కోశాధికారి దుర్గాప్రసాద్‌లను ఆయన పరిచయం చేశారు.

మురుగు పోయే మార్గం చూపరూ!



దువ్వాడ రైల్వేస్టేషన్ రహదారిలో నిలిచిపోయిన మురుగు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్ ఫారం వైపు విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. నాలుగో నంబర్ ప్లాట్ ఫారం వైపు ఏడాది కిందట రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా నాగదేవత కొండ దిగువను డ్రైనేజీ నిర్మిస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కాగా, రహదారి విస్తరణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఆటో స్టాండ్‌ను ఆనుకొని పెద్ద గొయ్యి ఏర్పడింది. వాటిని పూడ్చకుండా వదిలేయవడంతో వర్షాలకు నీరు చేరి నిల్వ ఉండిపోయి మురుగు కూపంలా తయారయ్యింది. వీటిని ఆనుకొని బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

చల్లగ చూడమ్మా.. వాసవీమాత



కన్యాకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం వాసవీ సంఘం సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, కోమల దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వాసవీ సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కార్యదర్శి కులుకూరి శ్రీనివాసరావు, చెల్లాల వెంకటరావు, కులుకూరి రమ, సువర్ణ, లలిత, సుజాత, సంతు, వెంకటరావు, ప్రభోజీ, బ్రహ్మాజీ, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

మంగళ కారిణి.. శక్తి స్వరూపిణి

దసరా మహోత్సవాలు నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం దుర్గాదేవి గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాలతో పాటు మండపాల్లో కొలువుదీరిన జగన్మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దుర్గమ్మా..చల్లగ చూడమ్మా అంటూ వేడుకున్నారు.



విద్యాలక్ష్మిగామహాలక్ష్మి



సరస్వతీ దేవిగా మహా సరస్వతి



గౌరీదేవిగామహాదుర్గ



జగ్గరాజు పేటలో దుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



గాయత్రీదేవి అలంకరణలో అగనంపూడి దుర్గాదేవి



కుంకుమపూజ చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: ఉక్కునగరంలోని త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీమహాదుర్గ అమ్మవారు పసుపు వర్ణం చీరలో గౌరీదేవిగా, శ్రీమహాలక్ష్మి గులాబీ వర్ణం చీరలో విద్యాలక్ష్మి అవతారంలో, శ్రీమహాసరస్వతి అమ్మవారు ఆకుపచ్చ చీరలో సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు సహస్ర సంపెంగ పుష్పార్చన చేశారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి కూడలి సమీపంలోని దుర్గాదేవి ఆలయంలోని దుర్గాదేవి శుక్రవారం దుర్గమ్మ గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్ని గాజులతో అలంకరించారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ

అగనంపూడి: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో భక్తులను కనువిందు చేశారు. 87వ వార్డు కణితి రథాలమ్మ శెట్టి బలిజ సేవా సంఘం, ఏడుగుళ్ల ప్రాంతాల్లోని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, సబ్బవరపు ఈశ్వరరావు, దాసరి అప్పడు, బొండా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

- అగనంపూడి పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు గాజులు, పసుపు, కుంకులు, చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బొర్ర మాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం భక్తిశ్రద్ధలతో పఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ మాట్లాడుతూ శనివారం అన్నపూర్ణాదేవి అవతారం సందర్భంగా అమ్మవారి సారె ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసి దుర్గామాత అమ్మవారిని శుక్రవారం వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధానకార్యదర్శి సంధ్రాన నూకరాజు, గొంతిన సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

అగనంపూడి: దేవి నవరాత్రుల సందర్భంగా 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నమ్మి ప్రసాద్, ఆదారి శ్రీను, యాదవ జగ్గరాజుపేట మండపం నిర్వాహకులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు



87వ వార్డు కణితిలో పూజలు చేస్తున్న భక్తులు